క్లుప్తంగా

ఆర్టీసీలో ఉద్యోగ నోటిఫికేషన్‌పై హర్షం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం హర్షనీయమని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆర్టీసీ సంస్థలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీలో కండక్టర్ల నియామకాలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 8 గంటల పనివిధానం అమలుచేయాలని, 2021, 2025 పేస్కేల్ ఇవ్వాలని, 2017 పేస్కేల్ ఏరియర్స్, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం విజయవంతం కోసం ఆర్టీసీ ఉద్యోగులు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారన్నారు. దసరా పండుగ సందర్భంగా ఒక్కో కార్మికుడికి రూ.25వేల బోనస్ అందజేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

ఇంజినీర్లకు ఘనంగా సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, లయన్స్ క్లబ్ సుప్రభాత్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ భవన్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్ డే సందర్భంగా గురువారం పలువురు ఇంజినీర్లను ఘనంగా సన్మానం చేశారు. వివిధశాఖల ఇంజినీర్లకు శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుదర్శన్ యాదవ్, సుప్రభాత్ అధ్యక్షుడు రుద్రోజీ, సభ్యులు అశోక్‌కుమార్ యాదవ్, గోవర్ధన్‌చారి, మృత్యుంజయ, లక్ష్మణ్ గౌడ్, మోహన్‌గౌడ్, రాములు, ప్రసాద్, సాయిలు, చెన్నయ్య,ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి అభినందన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీధర్ ఇటీవల మహాత్మాగాంధీ యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవంలో భాగంగా డాక్టరేట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆయనను ఘనంగా సన్మానించింది. కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావని, అధ్యాపకులు షాకీర్, యాకూబ్, గోవిందరాజులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



మహమ్మదాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంఘం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో ఉపాధ్యాయుల సమస్యలను నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి భూపతిసింగ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంచందర్‌రాథోడ్, మండల అధ్యక్షుడు జయసూర్య, కార్యదర్శి అన్నపూర్ణ, గండేడ్ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండా పాఠశాలను గురువారం ఉదయం మండల విద్యాధికారి ప్రకాశ్ తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రార్థన సమయానికి పాఠశాలకు వెళ్లారు. ప్రార్థన అనంతరం తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. తర్వాత ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎండీఎం ఆన్‌లైన్ నమోదు, ఎఫ్‌ఆర్‌ఎస్‌ను 100శాతం నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌గౌడ్, మలేఖాబేగం, పద్మావతి, అన్వర్ హుస్సేన్, అరుణకుమారి, నర్మద, గాయత్రి ఉన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన కొండమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని గురువారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

చికెన్ వ్యర్థాల సేకరణ వేలం వాయిదా

- టెండరు వేసిన వారికి అధికార, పాలకవర్గానికి కుదరని సయోధ్య
- గతేడాది రూ.41లక్షలకు 5శాతం అదనంగా పెంపు
- డిపాజిట్ రూ.2లక్షల నుంచి వేలం ప్రారంభించాలి
- మరోమారు నిర్వహిస్తామని అధికారుల ప్రకటన



చికెన్ వ్యవర్థాల వేలంలో పాల్గొన్న వేలందారులు, కౌన్సిలర్లు

జడ్చర్ల టౌన్: అనుకున్నంతా అయ్యింది జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం జరగాల్సిన చికెన్ వ్యర్థాల సేకరణ వేలం మరోమారు వాయిదా పడింది. టెండరు కోసం వచ్చిన వేలం పాటదారులు అధికారులు, పాలకవర్గానికి సయోధ్య కుదరకపోవటంతో వాయిదాకు కారణమైంది. మరోమారు వేలం నిర్వహిస్తామని, ఈ పర్యాయం బయటివాళ్లకు అవకాశం కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. అలా అయితే తాము చికెన్ వ్యర్థాలను సొంతంగా విక్రయించుకుంటామని వేలం దారులు వెల్లడించారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చికెన్ విక్రయ కేంద్రాలు 70 వరకు ఉన్నాయి. వాటి నుంచి సుమారుగా రోజుకు వ్యర్థాలు 2టన్నులు, ఆదివారం 3టన్నుల వరకు వస్తాయి. ఈ వ్యర్థాల సేకరణ కోసం ఒక వ్యక్తి మున్సిపాలిటీకి నామమాత్రపు రుసుం రూ.75వేలు చెల్లించి దుకాణాల వద్ద కొంత డబ్బు చెల్లించి సేకరించటం చేస్తున్నాడు. గతేడాది అదే తరహాలో రూ.75వేలకు రెన్యూవల్ చేయించుకోగా, ఆనోటా ఈ నోటా ప్రచారం కావటంతో రద్దుచేసి వేలం పెట్టారు. వేలంలో ఏకంగా రూ.75 లక్షలకు ఒక వ్యక్తి టెండరు దక్కించుకున్నాడు. ఆ వ్యక్తి అంతడబ్బులు తాను కట్టలేనని వెనకడుగు వేయటంతో రెండో టెండరుదారుకు రూ.41లక్షలకు వేలం కట్టబెట్టారు. అతడి గడువు ఈనెల మొదటి వారంలోనే ముగిసింది. తిరిగి వేలం పెట్టేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. వేలంలో ఇతర ప్రాంతాల వారికి అనుమతి ఇస్తూ ఈ నెల 11న వేలం నిర్వహించాల్సి ఉండగా, ఏకాభిప్రాయం కుదరక పోవటంతో వాయిదా వేశారు. బయటి వారికి అనుమతి నిరాకరిస్తూ స్థానికులకు మాత్రమే వేలంలో అవకాశం కల్పిస్తూ గురువారం వేలం నిర్వహించారు. ఇందులో నలుగురు రూ.2లక్షల చొప్పున డిపాజిట్ చేశారు. తీరా వేలం నిర్వహణ సమయంలో కమిషనర్ లక్ష్మారెడ్డి గతేడాది టెండరు డబ్బు రూ.41లక్షలతోనే వేలంపాట ప్రారంభిస్తామని చెప్పటంతో వివాదం మొదలైంది.



సమావేశం గదిబయట మాట్లాడుకుంటున్న చికెన్ విక్రయదారులు

పెరిగిన వివాదం–వేలం వాయిదా

తమకు ఎలాంటి సమాచారం లేకుండా రూ.41లక్షల నుంచి వేలం ఎలా మొదలు పెడతారంటూ టెండరుదారులు మహ్మద్ ఇనాయత్ అలి, పరుశరాముడు, షహబాజ్ అలీఖాన్, రాంచంద్రారెడ్డిలు అధికారులను ప్రశ్నించారు. రూ.2లక్షల డిపాజిట్ నుంచే వేలం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ముందుగా తమకు సమాచారం ఇచ్చి ఉంటే వేలంలో పాల్గొనకుండా ఉండేవాళ్లమని బదులిచ్చారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ మున్సిపాలిటీకి వచ్చే ఆదాయాన్ని ఎలా తగ్గించుకుంటామని, గతేడాది టెండరు డబ్బులు రూ.41లక్షల నుంచే వేలం పాడాలని సూచించారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. వేలం విషయంలో ఒక నిర్ణయానికి వచ్చి చెబుతామని కమిషనర్, పాలకవర్గం టెండరులో పాల్గొన్న వారికి సూచించారు.

సుదీర్ఘచర్చలు

వేలంపాటదారుల డిమాండ్‌పై కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డు కౌన్సిలర్లు సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. వేలం పాట రూ.2లక్షల నుంచే మొదలు పెట్టాలని కొందరు కౌన్సిలర్లు సూచించారు. తద్వారా వేలంలో పాల్గొన్న వారు సిండికేట్ అయి రూ.15–20లక్షలకే టెండరు దక్కించుకునే అవకాశం ఉందని మరికొందరు విభేదించారు. దీంతో పోయిన ఏడాదికన్నా అదనంగా ఆదాయం వచ్చేలా టెండరు నిర్వహించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. తదనంతరం తిరిగి వేలం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వేలం పాటలో పాల్గొన్న నలుగురికి విషయాన్ని వివరించారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ రూ.41లక్షలకు అంగీకరించేది లేదని చెప్పటంతో వేలం వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. తిరిగి వేలం వేసే తేదీని ప్రకటిస్తామని, ఆరోజున ఇతర ప్రాంతాల వారికి సైతం అనుమతి ఇస్తామని వెల్లడించారు. దీంతో వేలం దారులు తమ డిపాజిట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరారు. అందుకు పాలకవర్గం, అధికారులు సమ్మతించటంతో రభస సద్దుమణిగింది. బయటి వ్యక్తులను రానీయకుండా వేలం పాటను తక్కువకే దక్కించుకోవాలని స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా మారినట్లు తెలుస్తోంది.

స్థానికులైన మాకే అప్పగించాలి

చికెన్ వ్యర్థాల సేకరణ స్థానికులైన మాకే అప్పగించాలని పట్టణంలోని చికెన్ విక్రయకేంద్రాల నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. వ్యయ ప్రయాసాలకోర్చి తాము చికెన్ విక్రయాలు చేస్తుంటే అందులో వచ్చిన వ్యర్థాలను ఇతరులకు ఇవ్వటమేమిటని ప్రశ్నిస్తున్నారు.

యూరియా పంపిణీలో జాగ్రత్తగా ఉండాలి

నవాబుపేట: యూరియా పంపిణీ విషయంలో ఎరువుల దుకాణాల యజమానులు, సహకార సంఘం, తదితర కేంద్రాల అధికారులు చాలా జాగ్రత్తగా నడుచుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ సూచించారు. మండల కేంద్రంలోని మనగ్రోమోర్ ఎరువుల దుకాణంపై చర్యల నేపథ్యంలో ఆయన గురువారం మాట్లాడారు. ఎరువుల పంపిణీ పూర్తి పర్యవేక్షణలో జరుగుతుందని, అవకతవకలు జరిగితే చర్యలు తప్పవన్నారు. యూరియా నిజంగా రైతులకు అందించాలని ఆయన వివరించారు. స్టాక్ ప్రకారం రైతులకు అందించాలని కృత్రిమ కొరత, లేదా బినామీగా మొక్కుబడి పంపిణీలు చెల్లవని ఆయన హెచ్చరించారు. మండల కేంద్రంలో ఇప్పటి వరకు సహకార సంఘం, మూడు ఆగ్రో కేంద్రాలు, కొల్లూర్‌లో ఆగ్రో కేంద్రంలో యూరియా పంపిణీ జరిగింది. ఇక ముందు సైతం ఇవే కేంద్రాలో యూరియా అందుబాటులో ఉంటుందని వారంతా నిబంధనల ప్రకారం యూరియా పంపిణీ చేయాలన్నారు.

చిన్నచింతకుంట ఎస్‌ఐగా ఎస్ కృష్ణఓబుల్‌రెడ్డి

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట ఎస్‌ఐగా కృష్ణ ఓబుల్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తూ చిన్నచింతకుంటకు ఆయన బదిలీపై వచ్చాడు. చిన్నచింతకుంటలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ మహబూబ్‌నగర్ జిలా వీఆర్‌గా వెళ్లారు.

ప్రభుత్వ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాలను దాదాపు రూ.10 వేలకు తగ్గిస్తూ ఏకపక్షంగా ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేయడం తగదని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారూఖ్ హుస్సేన్, కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ వహీద్‌షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా జీతాలు పెంచే ప్రభుత్వాలు చూశాం కానీ, ఈ విధంగా చిరు ఉద్యోగుల జీతాలు ఏకంగా 30 శాతం తగ్గించడం సరికాదన్నారు. దీని వల్ల విద్యార్థుల విద్యా నాణ్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 1437 ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మత్తులో జీవితాలు చిత్తు చేసుకోవద్దు

రాజాపూర్: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను పాడు చేసుకోవద్దని ఎస్‌ఐ శివానందంగౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో ప్రజలకు సైబర్‌నేరాలు, రోడ్డుప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తమ సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజీలతో తప్పుడు ప్రచారాల వల్ల మోసపోవద్దని అన్నారు. గ్రామంలో ఇళ్లను అద్దెకు ఇచ్చే విషయాల్లో వారి ఆధార్‌కార్డులను తీసుకోవాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంధ విద్యార్థులను ప్రోత్సహించాలి

- న్యాయమూర్తి ఇందిర



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిర

పాలమూరు: అంధుల గౌరవం కాపాడుకోవడానికి ప్రత్యేకంగా వారికి చట్టాలు, హక్కులు ఉంటాయని, వాటిని తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ సమీపంలో ఉన్న అంధుల పాఠశాల, కళాశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో చూపులేని వారి పట్ల చిన్నచూపు ఉండరాదని, అంధులకు చేయూత, ప్రోత్సాహం ఇస్తే అన్ని రంగాల్లో ప్రయోజకులు అవుతారన్నారు. ఉపాధ్యాయులు అంధ విద్యార్థులకు ప్రత్యేక విద్య, శిక్షణ ఇస్తూ వారి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అంధ విద్యార్థుల స్కిల్స్‌లలో కూడా నైపుణ్యం పొందాలని, ముఖ్యంగా మానసిక, చెవిటి, మూగ, అంధత్వం ఉన్న దివ్యాంగులు వారి పనులు వారే చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. వారి హక్కులకు ఎలాంటి సమస్య ఉన్న వెంటనే న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకొస్తే కావాల్సిన న్యాయ సహాయం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలు చట్టాలు బాల్య వివాహాలు, బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన సేవలు అందించాలి



108లో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవి

గండేడ్: ప్రమాద బాధితులకు మెరుగైన సేవలు అందించాలని జీవీకే ఈఎంఆర్‌ఐ 108 అంబులెన్స్‌ల ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని వివిధ రకాల పరికరాలను వాటి పనితీరును ఆయన పరిశీలించారు. మందులు, కేసులకు సంబంధించిన రికార్డులను సైతం ఆయన పరిశీలించారు. అంబులెన్స్‌లో ఉండే పరికరాలు ఏవైనా పనిచేయకపోతే తక్షణమే వాటిని బాగుచేయించుకోవాలన్నారు. ప్రమాద బాధితులను, ఇతర బాధితులను అంబులెన్స్‌లో ఎక్కించుకున్న తర్వాత ప్రథమ చికిత్స చేయాలన్నారు. ముందుగా క్షతగాత్రులను సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని, అక్కడి నుంచి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించాలని పేర్కొన్నారు. వారిని ప్రాణాపాయం నుంచి కాపాడి వారు త్వరిత గతిన సకాలంలో కోలుకునేలా చేయడంలో అంబులెన్సు సిబ్బంది పాత్ర ఎంతో ఉంటుందన్నారు. అత్యవసర సేవలు అత్యుత్తమంగా అందించడంతో పాటు అంబులెన్స్ సిబ్బంది ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. ఈఎంటీ జానమ్మ, పైలెట్ అక్బర్ ఉన్నారు.

ఉత్సాహంగా అర్బన్ ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం మహబూబ్‌నగర్ అర్బన్‌స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాల బాల, బాలికలకు ఖోఖో, కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ హాజరై క్రీడాకారులను సెలక్షన్స్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. అర్బన్ కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్ మాట్లాడుతూ ఈ సెలక్షన్స్‌కు ఆయా పాఠశాలల నుంచి దాదాపు 650 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బాల్‌రాజు, ప్రసన్నకుమార్, సయ్యద్ ముస్తఫా, రామేశ్వర్, అరుణజ్యోతి, ఉమాదేవి పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: పిల్లలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెరిసేలా తయారు చేయాల్సిన బాధ్యత క్రీడా ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఏటీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్–14, –17లలో సుమారు 20జట్లు పాల్గొన్నాయి.



కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు



భూత్పూర్‌లో ఎంపికైన విద్యార్థులు

భూత్పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు రవికాంత్, భానుప్రియ, సంధ్యారాణి పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడలు

నవాబుపేట: మండల స్థాయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రీడలు శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి నాగ్యానాయక్ తెపారు.

ఫొటో, వీడియో గ్రాఫర్లకు అండగా ప్రభుత్వం



లూయిస్ డాగురెన్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఫొటో, వీడియో గ్రాఫర్లకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎమ్మెస్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఫొటోగ్రాఫర్ల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఫొటోగ్రాఫర్ల పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫొటో, వీడియో గ్రాఫర్లకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేస్తామన్నారు. నూతన కమిటీ సభ్యులకు శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన బాధితుడు గంజి బాల్‌రాజును ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, గోపి, జిల్లా ఇన్‌చార్జి సత్యనారాయణ, నాయకులు ఎస్ వెంకటేష్, జీజీ పాల్, మహిమూద్, జహంగీర్ ఉన్నారు.

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



మాట్లాడుతున్న జరీనా బేగం

గండేడ్: గర్భిణులు, బాలింతలు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, నూనె, చక్కెర, ఉప్పు వంటి వాటి వాడకం తగ్గించుకోవాలని జిల్లా శిశు సంక్షేమ అధికారి జరీనాబేగం పేర్కొన్నారు. ఈనెల17 నుంచి అక్టోబర్ 16 వరకు జరిగే పోషణ మాసంలో భాగంగా గురువారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారంలో అన్ని సమతూకంలో ఉంటాయని ఆమె తెలిపారు. ఈ ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సులభ సాధ్యమవుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాల ద్వారా పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకుంటారని, అది పిల్లల భవిష్యత్‌కు పునాది వంటిదన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంఈఓ జనార్దన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంటు గోపాల్, ఏఎన్‌ఎం రేణుక, అంగన్‌వాడీ టీచర్ చందన పాల్గొన్నారు.

నూతన మహిళా గ్రూపులు తయారు చేయాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు కొత్తగా గ్రూపులు ఏర్పాటు చేసి వారిని సభ్యులుగా చేర్చుకునే అవకాశం కల్పించాలని మెప్మా పీడీ మహ్మద్ యూసూఫ్ సూచించారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని, అందుకోసం మనవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరం కృషి చేయాలన్నారు. ఇప్పటికే నమోదైన గ్రూపులే కాకుండా కొత్త గ్రూపులకు అవకాశం ఇవ్వాలని, తద్వారా సంఘాల్లో లేని మహిళలకు సైతం అవకాశం కల్పించినట్లవుతుందన్నారు. ఆర్థికాభివృద్ధికి మహిళలే మూలం అన్నట్లుగా సమాఖ్యలో ఉన్న ప్రతి మహిళ పాటుపడాలన్నారు. సమావేశంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, సమాఖ్య అధ్యక్షురాలు శ్వేత జోయెల్, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ మహ్మద్ యూసూఫ్

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



జడ్చర్ల టౌన్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వారోత్సవాలు, సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్ సన్మానించారు. జీపీ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మున్సిపల్ కార్మికులను శాలువాతో సత్కరించి పూలతో అభినందించారు. సామల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నడిమింటి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మధు, కిట్టు, రాజు, అవినాష సౌమ్యనాయక్, నవీన్, శివ, రాకి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



దేవరకద్ర: మండలంలోని జీనుగరాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ, బొమ్మలను గూంజ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గురువారం అందజేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్ బాదం మాట్లాడారు. గూంజ్ ఎన్‌జీఓ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గూంజ్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా మాడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ జిల్లా మాడ్రన్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపీ ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.క్రిష్ణయ్య, కోశాధికారిగా రాకేష్‌లు ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.రాంరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మాడ్రన్ కబడ్డీని విస్తరించాలని, క్రీడలు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలి

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన శ్మశానవాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నందున ఆ స్థలాన్ని కాపాడాలని గురువారం పంచాయతీ కార్యదర్శి కల్యాణికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 205లో రెండు ఎకరాల పొలాన్ని సోలార్ కంపెనీ నిర్వాహకులు పదేళ్ల కిందట గ్రామ పంచాయతీకి అప్పగించారు. భూమి లేని నిరుపేదలు దాన్ని శ్మశానవాటికగా వాడుకుంటున్నారు. కార్యక్రమంలోయువకులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తృతీయ ఏడాది విద్యార్థినులకు నిర్వహిస్తున్న ఎంప్లాయిబిలిటి సామర్థ్యాల కల్పన 30రోజుల శిక్షణ గురువారం ముగిసింది. కళాశాల టీకేఎస్‌సీ, ఉమీద్ టీం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మహిళా సాధికారతకు సంబంధించిన అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్‌బేస్డ్ స్కిల్స్ క్షుణ్ణంగా నేర్పించారు. శిక్షణలో 57మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి తెలిపారు. వారికి గురువారం ప్రిన్సిపాల్ డా.సుకన్య సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వుయ్‌హబ్ ప్రతినిధులు సౌమ్య, వినయ్, వైస్‌ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు, అధ్యాపకులు రాఘవేందర్‌రెడ్డి, కల్యాణి నర్సింహారావు, వీరప్రతాప్, శిరీష, నందిని పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎర్రా నర్సింహులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే 2న దసరా పండుగ ఉన్నందున ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు అక్టోబర్ 1న వేతనాలు చెల్లించాలన్నారు. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినందున మరో వంద మంది కార్మికులను అదనంగా నియమించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభాకర్, ఎస్.శ్రీనివాసులు, బాల్‌రాజు, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటమే మార్గం



మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయడమే మార్గమని సీఐటీయూ రాష్ట్ర నాయకులు జి.తిరుపతయ్య అన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చేందుకు వేగంగా పని చేస్తోందని మండిపడ్డారు. సమ్మె చేసే హక్కును హరించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. సంఘటిత రంగాలు ఎల్‌ఐసీ, బ్యాంకు, పోస్టల్, టెలికాం, బొగ్గు, చమురు, స్టీలు, విమానయానం, రైల్వే తదితర ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన పోరాటాలను కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అన్నిరంగాల కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, రాజేశ్వర్, ఖమర్‌అలీ, కిల్లెగోపాల్ తదితరులు పాల్గొన్నారు.